క్లుప్తంగా

విద్యార్థులకు పోషకాల భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ సూర్యసాయి

చంద్రగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనం వడ్డిస్తున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయి తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా సప్తశిక్షాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సహకారంతో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు పాల్గొన్నారు.

నేడు ఫొటో, వీడియోగ్రాఫర్ల సమావేశం

తిరుపతి కల్చరల్: ఏపీ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కర్నాలవీధిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జేఏసీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఫొటో, వీడియోగ్రాఫర్స్‌ల సమస్యలపై చర్చించి వాటి పరిష్కార దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా నిర్వహించనున్న సమావేశానికి ఫొటో, వీడియో గ్రాఫర్స్‌తో పాటు ఆయా సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు రఫీ, కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అన్వర్‌బాషా

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అన్వర్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో విధుల నిర్వహణకు ఇక్కడకు వచ్చిన తహసీల్దార్ బదిలీ కావడంతో ఆస్థానంలో డిప్యూటీ తహసీల్దార్ అన్వర్‌బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆర్‌పీపై విచారణకు డిమాండ్

తిరుపతి కల్చరల్: మెప్మాలో ఆర్‌పీగా పని చేస్తున్న హేమలత ఆర్థిక కార్యకలాపాలు, సభ్యులను వేధిస్తున్న తీరుపై న్యాయ విచారణ జరిపించాలని కొర్లగుంటకు చెందిన గాయత్రి అనే బాధితురాలు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. ఆర్‌పీ హేమ వద్ద తమ వ్యక్తిగత అవసరాలకు రూ.5 లక్షలను వడ్డీకి అప్పుగా తీసుకున్నామన్నారు. ఇప్పటికే అసలు కంటే ఎక్కువగా వడ్డీ చెల్లించామని తెలిపారు. ఎట్టకేలకు అప్పు కూడా తీర్చేసినా తొలుత తాము ఇచ్చిన చెక్కులను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. పైగా తమ ఇంటి వద్దకు మనుషులను పంపి బెదిరింపులకు దిగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఆమెపై విచారణకు ఆదేశించాలని కోరారు.

సిద్ధేశ్వరునికి విశేష పూజలు

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వసతులు లేవు.. పత్రికలు రావు

ప్రభుత్వ కళాశాలల్లోని గ్రంథాలయాలు అధ్వానంగా తయారయ్యాయి. విజ్ఞాన భాండాగారాలుగా భాసిల్లిన లైబ్రరీలు ప్రస్తుతం దీనావస్థకు చేరాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో చిరిగిన పుస్తకాలతో నిండిపోయాయి. విద్యార్థులకు అవసరమయ్యే అకడమిక్ బుక్స్ సైతం కొత్తవి రాని దయనీయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన పెంపొందించుకునేందుకు కనీసం దినపత్రికలు కూడా కనిపించని దుస్థితిలోకి వెళ్లిపోయాయి. మౌలిక వసతులు కరువై పాఠకులకు ప్రశాంత వాతావరణం కల్పించడంలో విఫలమయ్యాయి.

- నిర్లక్ష్యపు నీడలో గ్రంథాలయాలు
- శిథిలావస్థలో పుస్తకాలు
- కానరాని దిన పత్రికలు
- కరెంట్ అఫైర్స్, ఎంప్లాయిమెంట్ సమాచారం కోసం పాఠకుల అవస్థలు
- కరువైన మౌలిక సదుపాయాలు
- టీటీడీ కళాశాలల్లో పరిస్థితి మరింత అధ్వానమంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: నగరంలోని పలు కళాశాలు, పాఠశాలల్లోని గ్రంథాలయాలలో మౌలిక వసతుల లేవు. తిరగని ఫ్యాన్‌లు, విరిగిన కుర్చీలు, బూజు పట్టిన పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయాలు పరిస్థితి దారుణంగా మారడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలోనూ, జూనియర్, డిగ్రీ కళాశాలలోనూ, ప్రభుత్వ వసతి గృహాలలోనూ ప్రతి రోజు దినపత్రికలు, మ్యాగజైన్స్‌ను తెప్పించాల్సిన అవసరం ఉంది. నిబంధనలకు తిలోదాకలు వదిలిన అధికారుల అలసత్వానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కళాశాలల్లో పరిస్థితి అధ్వానం

డిగ్రీ విద్యార్థులకు రోజువారీ ప్రతికల్లో వచ్చే కరెంట్ ఎఫైర్స్ పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగకరం అటువంటిది ఏ కళాశాలల్లోనూ దినపత్రికలు కానరావు. ఎంప్లాయిమెంట్ న్యూస్, కరెంట్ ఎఫైర్స్ కోసం, దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, విద్యా సంస్కరణలు, అధునాతన సాంకేతిక సమాచారం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఇలాంటి నిబంధన విధించింది. ప్రస్తుతం ఎంప్లాయిమెంట్ న్యూస్ కోసం విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బయట షాపులలో అమ్ముతున్న దినపత్రికలను ఇద్దరు ముగ్గురు కలసి కొనుగోలు చేస్తున్నారు.



టీటీడీ కళాశాలల్లో మరింత దారుణం

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పేరుకు గ్రంథాలయం ఉంది. ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. మౌలిక వసతుల మాట దేవుడెరుగు. అసలు గ్రంథాలయంలో ఉండాల్సిన ప్రధాన పత్రికలు జాడే ఉండదు. పేద విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలల్లో పోటీ పరీక్షలకు ప్రిపరేషన్‌కు డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల నాటి పాత పుస్తకాలు, బూజు పట్టిన నవలలు ఉంటున్నాయే కానీ, అకడమిక్ విద్యకు సంబందించిన పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు ఫైల్ పెట్టాం అనుమతులు కోసం చూస్తున్నాం. వచ్చిన వెంటనే అన్నీ తెప్పిస్తాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

పాత పుస్తకాలే గతి

గ్రంథాలయాల్లో పాతపుస్తకాలు మాత్రమే ఉన్నాయి. ఎక్కడా రోజువారీ దినపత్రికలు కనపడవు. కరెంట్ ఎఫైర్స్, ఉద్యోగ సమాచారం కోసం మార్కెట్‌లో అమ్ముతున్న పత్రికలను, పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాం. దేశంలో, రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలియని అజ్ఞానంలో ఉన్నాం. స్మార్ట్‌ఫోన్‌లు లేని మాలాంటి వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాలలో విద్యార్థులకు అవసరమైన దినపత్రికలు, మ్యాగజైన్‌లు, ఎంప్లాయిమెంట్ న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నాం. –టీటీడీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఓ పేద విద్యార్థి ఆవేదన

బిరుదు ప్రదానం



రంగనాథన్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం అధ్యాపకుడు ప్రొఫెసర్ సి.రంగనాథన్‌ను ప్రవచన చక్రవర్తి బిరుదు వరించింది. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ కడప జిల్లా గండికోట పుణ్యక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఆయనకు ప్రవచన చక్రవర్తి బిరుదు ప్రదానం చేసి సత్కరించింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీవారు, పద్మావతీ అమ్మవారి వైభవాన్ని రంగనాథన్ తన ప్రవచనాల ద్వారా ఇనుమడింపజేస్తున్నారని కొనియాడారు.

బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

పాకాల: స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం బీటీఏ 24వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బీటీఏ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య మాట్లాడుతూ 2001లో బీటీఏ స్థాపించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల్లో బహుజన ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. నవీన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని వివరించారు. బీటీఏ రాష్ట్ర గౌరవ సలహాదారు ఆంజనేయులు, నాయకులు జ్యోతిప్రసాద్, ఆదికేశవులు, జయబాల, విజయమోహన్, తులసీరామ్, వెంకటయ్య, కృష్ణమూర్తి, వెంకటస్వామి, గోపాలయ్య, నాగరాజా, సుధాకర్, సుబ్బయ్య పాల్గొన్నారు.

అక్రమాలను పశ్నించినందుకే ఆరోపణలు



మాట్లాడుతున్న గండికోట సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: డీఎంహెచ్‌ఓ శ్రీహరి అక్రమాలను ప్రశ్నించి, విచారణకు డిమాండ్ చేసినందుకే ఆయన తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సమత సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఆయన అక్రమాలపై ఆధారాలను త్వరలోనే బయటపెడతామని వెల్లడించారు. 23 ఏళ్లుగా అనేక ప్రజా ఉద్యమ పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్ విచారణకు ఆదేశించగానే తమ ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని భూషణ్ రాజు, మోహన్ రాజు అనే వ్యక్తులతో డీఎంహెచ్‌ఓ రాయబారం పంపించారని ఆరోపించారు. డాక్టర్ శ్రీహరి అవినీతికి పాల్పడకపోతే తమతో బేరసారాలకు ఎందుకు యత్నించారని ప్రశ్నించారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం



వీసీకి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళావర్సిటీలో విద్యార్థినులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించడం అవసరమని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఈ మేరకు ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌ఓ, ఎన్‌ఎస్‌యూ నేతలు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వి.ఉమకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వర్సిటీలో రెండు రోజుల క్రితం జరిగిన ఘటన దారుణమని, మాదకద్రవ్యాల వినియోగం–పర్యవసానంపై ప్రత్యేక అవగాహన సదస్సులు తక్షణం ఏర్పాటు చేసి విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు.

వైభవం.. 'ఆడి' సంబరం





భరణి దీపోత్సవంలో భక్తులు, కావళ్లతో ఊరేగింపుగా వెళుతున్న అనుప్పల్లె వాసులు

పాకాల: ఆడికృత్తికను పురస్కరించుకుని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కావళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాకాల మండలం ఊట్టవారిపల్లె సమీపంలోని ఆనందగిరి కొండపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని నెమలి వాహనంపై ఊరేగించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సోంపల్లె చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షించారు. కిషోర్, లేట్ మద్దినేని శ్రీనివాసులనాయుడు, రాయరెడ్డెయ్యచౌదరి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అనుప్పల్లెలో..

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లెలో కావడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికిప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం చేపట్టారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి యోగుల పర్వతంపై కొలువైన జ్ఞాన కుమారస్వామికి పూజలు చేశారు.

కమనీయం కల్యాణం

చంద్రగిరి: స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులో పుట్టాలమ్మ ఆలయంలో అనుబంధంగా వెలసిన శ్రీసుబ్రమణ్యస్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సోమవారం భరణి నక్షత్రం విశేష పూజలను చేశారు. స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ శివకుమార్ శర్మ జరిపించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

తిరుపతి సిటీ: విధి నిర్వహణలో ఉద్యోగులు సమయపాలన పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ అప్పారావు హెచ్చరించారు. సోమవారం ఎస్వీయూ పరిపాలనా భవనంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీ బిల్డింగ్‌లో పలు విభాగాలను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సంబంధిత విభాగాల అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే ఏమాత్రం ఉపేక్షించేంది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన త్యాగరాజ సంగీతోత్సవాలు



సంగీత విద్వాంసుల కచేరీ

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐదురోజుగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు పాల్గొని త్యాగరాజస్వామికి కళా నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సాయంత్రం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వాయిద్య సంగీత కచేరి ఆకట్టుకుంది. అనంతరం ఎస్.నిత్యశ్రీ బృందం ప్రదర్శించిన వీణ వాయిద్యం సభికుల హృదయాలను రంజింపజేసింది. వీరికి మృదంగంపై బి.శివరామన్, ఘటంపై ఎన్.గురుప్రసాద్ చక్కటి సహకారం అందించారు. చివరిగా టీఎస్ పట్టాభిరామ పండిట్ గాత్ర కచేరి శ్రవణానందకరంగా సాగింది. వీరికి వయోలిన్‌పై మైసూర్ వి.శ్రీకాంత్, మృదంగంపై నైవేలీ స్కంద సుబ్రమణ్యం, కంజీరపై అలత్తూరు రాజగణేష్ సహకరించి రక్తి కట్టించారు. అనంతరం హరిద్వార మంగళం ఏకే పళణివేల్‌కు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేశారు.

పవిత్రోత్సవాలకు నేడు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. వైదిక సంప్రదాయం ప్రకారం ఆలయంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో తెలియక జరిగే దోషాల ద్వారా ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా చేపట్టే పవిత్రోత్సవాల్లో మొదటి రోజు యాగశాలలో పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం, రెండోరోజు పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిపించనున్నారు. మూడో రోజు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం స్వామివారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు ఇద్దరు రూ.500లు చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. వారికి ఉత్తరీయం, రవికె, చివరి రోజు ఒక పవిత్రం బహుమానంగా అందజేస్తారు. ఉత్సవాల సందర్భంగా నిత్యం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

1న విష్ణు సహస్రనామ జపయజ్ఞం



మాట్లాడుతున్న నాగేంద్రసాయి

తిరుపతి కల్చరల్: ఆలిండియా విష్ణు సహస్రనామ కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీన తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవిష్ణు సహస్రనామ అఖండ జపయజ్ఞం చేపడుతున్నట్లు ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎన్. నాగేంద్రసాయి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత 35 ఏళ్లుగా క్రమం తప్పకుండా విష్ణు సహస్రనామ అఖండ జపయజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా 1వ తేదీ ఉదయం 6 నుంచి 2వ తేదీ ఉదయం 10 గంటల వరకు నిరంతరాయంగా 27 గంటల పాటు జప యజ్ఞం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముగింపు కార్యక్రమానికి అహోబిలం జీయర్ స్వామి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ కో–ఆర్డినేటర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పులుల దినోత్సవం





మాట్లాడుతున్న జూ క్యూరేటర్ సెల్వం, పులుల ప్రాధాన్యతపై చిత్రలేఖనం వేస్తున్న విద్యార్థులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో సోమవారం సెట్విన్ ఆధ్వర్యంలో ప్రపంచ పులుల, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూకు వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులకు జూ క్యూరేటర్ సెల్వం పులుల ప్రాధాన్యతను వివరించారు. పులులతో పాటు అడవులను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పులుల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, నాగభూషణం, జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్, సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సమన్వయంతో తిరుపతి అభివృద్ధి

- నగరవాసుల సంక్షేమమే లక్ష్యం
- ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం
- కార్పొరేషన్ కమిషనర్ మౌర్య



ప్రజా సమస్యలపై కమిషనర్ మౌర్యతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి తుడా: ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ తిరుపతిని మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తిరుపతి ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలు, మౌలిక వసతుల కల్పనకు బృహత్ ప్రణాళిక రూపొందించి దశలవారీగా అమలు చేస్తామని వివరించారు. టీడీఆర్ బండ్లపై లోతైన విశ్లేషణ చేయనున్నట్లు చెప్పారు. స్పందనలో అత్యధికంగా టీడీఆర్ బాండ్లు మంజూరు చేయాలని వినతులు వచ్చాయన్నారు. కార్పొరేటర్లు తీసుకువచ్చిన ఫిర్యాదులను పూర్తిగా అధ్యయనం చేశాక పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

పబ్లిక్ గ్రీవెన్స్‌కు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ క్రమంలోనే కార్పొరేటర్లు సైతం భారీగా వినతులు తీసుకువచ్చారు. వారికి ముందుగా అవకాశం కల్పించడతో అర్జీదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కార్పొరేటర్లకు మరోరోజు అవకాశం కల్పిస్తే సామాన్యులకు అవస్థలు ఉండవని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు అర్జీలను కమిషనర్ మౌర్య స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధితశాఖ అధికారికి అందజేశారు. అలసత్వం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్‌ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య హెచ్చరించారు. సోమవారం ఉదయం పారిశుద్ధ్య పర్యవేక్షణ లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. మస్టర్ పాయింట్ల వద్ద కార్మికుల హాజరుపై ఆరా తీశారు. డివిజన్ కి ఎంతమంది కార్మికులు ఉన్నారు, ఎంతమంది హాజరవుతున్నారనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో రాజీ పడే ప్రసక్తే ఉండదన్నారు. ప్రతిరోజు చెత్త సేకరణ, తరలింపును సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుల హాజరు వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య



హోరువాన

తిరుపతి నగరంలో సోమవారం రాత్రి గంట పాటు ఎడతెరపిలేని వాన కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాటి లోతు నీటిలో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



బండ్ల వీధిలో వర్షపు నీటిలో జనం ఇబ్బందులు